సంకల్పానికి తూట్లు.. ప్రయాణికులకు అగచాట్లు

మందుబాబులకు అడ్డాగా లక్కిరెడ్డిపల్లి బస్టాండ్

- మూడు రోడ్ల కూడలిలో బస్సుల కోసం వేచివుండలేక ప్రజల అవస్థలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.47 లక్షలతో బస్టాండ్ అభివృద్ధి
- బస్టాండ్‌కు మెరుగులు దిద్ది ప్రారంభించాలంటూ స్థానికుల విన్నపం


ప్రయాణికుల సౌకర్యార్థం గత ప్రభుత్వం నిర్మించిన లక్కిరెడ్డిపల్లి ఆర్టీసీ బస్టాండ్


నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

లక్కిరెడ్డిపల్లి : ఒకప్పటి నియోజకవర్గ కేంద్రమైన లక్కిరెడ్డిపల్లి ప్రస్తుతం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎక్కడా చూసినా సమస్యలు తిష్ట వేశాయి. దీంతో ప్రజలు ఇబ్బందుల నడుమే జీవనం సాగిస్తున్నారు. కాగా ఒకప్పటి నియోజకవర్గ కేంద్రమైన లక్కిరెడ్డిపల్లెలో ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో సుమారు 50 సెంట్లలో బస్టాండ్‌ను నిర్మించారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఉండటానికి అనువుగా ఉండేది. కాలక్రమేణా అది కాస్త నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుకుంది. గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు కేటాయించి బస్టాండ్‌ను ఆధునీకీకరించింది. ఆ తరువాత కూటమి ప్రభుత్వ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం నిరుపయోగంగా.. అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది.

ప్రయాణించేవారిలో మహిళలే అధికం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలలో మహిళలకు ఉచిత ప్రయాణం ఒకటి. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తరువాత ఆ హామీని ఇటీవలే అమలు చేసింది. ఆ తరువాత ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ప్రయాణం కాస్త పెరిగింది. మండలంలో బస్టాండ్ ప్రాంగణం వినియోగంలోకి రాకపోవడంతో మహిళామణులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉంది. మూడు రోడ్ల కూడలిలో నిలబడలేక.. బస్సుల కోసం వేచి చూడలేక వారు పడుతున్న ఇబ్బందులు పడుతున్నారు. కాలకృత్యాలకు వారు పడుతున్న బాధలు ఎవరికి చెప్పుకోలేకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గొప్ప సంకల్పంతో అభివృద్ధికి నోచుకున్న లక్కిరెడ్డిపల్లె బస్టాండ్‌ను కూటమి ప్రభుత్వం ప్రారంభించి తమ తిప్పలు తీర్చాలని మహిళలు కోరారు. ఇప్పటికైనా ఆశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు బస్టాండ్ ప్రాంగణానికి మెరుగులు దిద్ది ప్రారంభానికి నోచుకునే విధంగా చొరవ చూపాలని మహిళా ప్రయాణికులు విన్నవిస్తున్నారు.

కొరవడిన పోలీసుల పర్యవేక్షణ

రాత్రి అయితే చాలు లక్కిరెడ్డిపల్లె బస్టాండ్ ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారుతోంది. బస్సుల హారన్‌లు వినిపించాల్సిన చోట మందు సీసాల చప్పుళ్లు అధికమయ్యాయి. మండల కేంద్రంలో ఇంత జరుగుతున్న పోలీసులు చోద్యం చూస్తుండటంతో మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందన్న వాదన ఉంది. పలు సందర్భాల్లో చిన్నపాటి ఘర్షణలు జరుగుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన లక్కిరెడ్డిపల్లె బస్టాండ్‌ను ప్రారంభానికి నోచుకునే విధంగా ఆర్టీసీ జిల్లా స్థాయి అధికారులు, రాష్ట్ర మంత్రి చర్యలు చేపట్టాలని మండల ప్రజానీకం కోరుతోంది.

మంత్రి సారూ.. ఇది చూశారా


బస్టాండ్ ఆవరణలో బీరుబాటిళ్లు పడేసిన వైనం

శిథిలావస్థకు చేరుకున్న ఆర్టీసీ ప్రాంగణాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మండల నాయకుల చొరవతో దశ మారింది. రూ.47 లక్షల నిధులతో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించింది. తీరా ప్రారంభానికి సిద్ధమవుతున్న వేళ సార్వత్రిక ఎన్నికలు రావడంతో కోడ్ కారణంగా ప్రయాణికులకు అందుబాటులోకి రాలేదు. దీంతో ప్రజలు మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో ఎండ, వాన, గాలికి బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆర్టీసీ శాఖ మంత్రి కూడా అయిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె బస్టాండ్ ప్రాంగణాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారన్న వాదనను మండల ప్రజలు తెలియజేస్తున్నారు. మంత్రి బస్టాండ్‌ను ఎప్పుడు ప్రారంభించి తమ అవస్థలు తీరుస్తారో అని లక్కిరెడ్డిపల్లె వాసులు వేయి కళ్లతో వేచి చూస్తున్నారు.

ఎండకు వేచి ఉండలేకున్నాం



రాయచోటికి కానీ, వేంపల్లికి కానీ వెళ్లాలంటే లక్కిరెడ్డిపల్లి మూడురోడ్ల కూడలిలో గంటలకొద్దీ ఆర్టీసీ బస్సు కోసం నిలబడాల్సి వస్తోంది. లక్కిరెడ్డిపల్లిలో సంవత్సరాల తరబడి ఇదే దుస్థితి నెలకొంది. వేంపల్లి రోడ్డు మార్గంలో ఆర్టీసీ బస్టాండ్ ఉన్నా నిరుపయోగంగా మారడంతో మూడురోడ్ల కూడలిలో ఎండ, వాన, గాలికి నిలవలేక ఇబ్బంది పడుతున్నాం. ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రయాణికులకు వినియోగంలోకి తీసుకురావాలి.

– ఇర్షాద్, లక్కిరెడ్డిపల్లి టౌన్

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



లక్కిరెడ్డిపల్లిలో ఆర్టీసీ బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మండల కేంద్రం నుంచి వేంపల్లి, గండి, రాయచోటి, కడప, రామాపురానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మూడు రోడ్ల కూడలిలో గంటల కొద్ది బస్సుల కోసం నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీ బస్టాండ్‌ను లక్కిరెడ్డిపల్లిలో కట్టినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు చొరవ చూపి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

– నాగరత్నమ్మ, ప్రయాణికురాలు, లక్కిరెడ్డిపల్లి

మందుబాబుల ఇష్టారాజ్యం



ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా మారి మందుబాబులు రాత్రి సమయాలలో రాజ్యమేలుతున్నారు. మద్యం తాగడానికి బస్టాండ్ అనువుగా ఉండటంతో మందుబాబులు మద్యం సేవించి సీసాలు బస్టాండ్ అంతా వేస్తున్నారు. ప్రయాణికులకు బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. మరుగుదొడ్లు లేక మహిళలు, పురుషులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను ప్రయాణికులకు వినియోగంలోకి తీసుకురావాలి.

– విజయ్ కుమార్, ఉత్తరమెట్ట ఎస్సీ కాలనీ, లక్కిరెడ్డిపల్లి

క్లుప్తంగా

అపరిశుభ్రత ఉండకూడదు


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అధికారి విజయ్ భాస్కర్

సిద్దవటం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని డివిజనల్ పంచాయతీ అధికారి విజయ భాస్కర్ పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మాధవరం -1 పంచాయతీలో తడి, పొడి చెత్తను నిల్వచేసే విధానం, సీజన్ వ్యాధులు రాకుండా గ్రామాలలో బ్లీచింగ్ పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ జానకి రామయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


శ్రమదానం చేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ నాయకులు తోట శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం సేవాపక్షోత్సవాలలో భాగంగా ప్రజలకు పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అలాగే పగడాలపల్లి, ధర్మాపురం ప్రాంతాలలో శ్రమదానం నిర్వహించి పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు.

ఆసుపత్రిలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న దాతతో నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పుట్టినరోజు సందర్భంగా చేపడుతున్న సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాయచోటి బీజేపీ నాయకులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్‌లు హాజరయ్యారు. రక్తదాన శిబిరంలో దాదాపు 60 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డా.శ్రీనివాస రాజు, శివగంగిరెడ్డి, నిర్మల్‌కుమార్, గాజుల ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

‘బిట్స్’లో కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండల పరిధిలో ఉన్న భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాల (బిట్స్)లో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు కళాశాల చైర్మన్ భాస్కర్ తెలిపారు. కళాశాలలోని 400 మందికి పైగా విద్యార్థులకు డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వారు కంటి వైద్య పరీక్షలు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీ సేవలు మరువలేనివి


ఈఓపీఆర్డీని సత్కరిస్తున్న ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలో విధులు నిర్వర్తించిన ఈఓపీఆర్డీ నాగార్జున సేవలు మరువలేనివని శుక్రవారం వైస్‌ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. బదిలీపై వెళుతున్న ఆయన్ను మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గ్రామాలలో సమస్యల పరిష్కారంలో ఈఓపీఆర్‌డీ కృషిని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రమేష్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఉత్సవానికి రండి


ఎంపీపీ మేడాను ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె జెండామాను వీధిలో హజరత్ మహబూబ్ సుభాని జెండా మహోత్సవ కార్యక్రమం అక్టోబర్ 9, 10వ తేదీలలో జరుగుతుందని ఉత్సవానికి హాజరుకావాల్సిందిగా మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్‌రెడ్డిని జెండా కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మట్లాడుతూ కొన్ని అనివార్య కారణాల వల్ల గత 15 సంవత్సరాలుగా జెండా మహోత్సవం జరగలేదని, ఈసారి అంగరంగ వైభవంగా జరుపుతున్నామని తెలియజేశారు.కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యులు కలీముల్లాఖాన్, మోహన్‌రెడ్డి, తుమ్మల శ్రీధర్‌గౌడ్, పాటూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉండాలి


వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోడూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి గురువారం రాత్రి తాడేపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలను అధినేత దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ రైల్వేకోడూరు పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపినట్లు చెప్పారు. ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తెలియజేశారన్నారు.

విద్యార్థుల హామీలపై అసెంబ్లీలో చర్చించాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థి నాయకుల నిరసన

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రాయచోటిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో విద్యార్థుల కష్టాలు తీరుస్తాం.. విద్యార్థులకు ఏ కష్టాలు కూడా ఉండవు.. వారికి అండగా నేను ఉంటానని నారా లోకేష్ హామీ ఇచ్చారని కానీ అందుకు విరుద్ధంగా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుపుతున్నారని మండిపడ్డారు. సూపర్‌హిట్ సుపరిపాలన అంటూ సంబరాలు చేసుకుంటున్నారు కానీ విద్యార్థుల కష్టాలు తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు.

కార్యకర్తలే వైఎస్సార్‌సీపీ బలం


గువ్వలచెరువులోని ఓ టీ అంగడిలో కార్యకర్తలతో ముచ్చటిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : కార్యకర్తలే వైఎస్సార్‌సీపీ బలమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రామాపురం మండలంలోని గువ్వలచెరువు, కసిరెడ్డిగారిపల్లె, గోపగుడిపల్లె గ్రామాల నాయకులు, కార్యకర్తలతో ఆయన భేటి అయ్యారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలుకరించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ భేటి గువ్వల చెరువులోని ఓ టీ దుకాణం వేదిక అవ్వడం విశేషం. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేసి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునే విధంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు గువ్వలచెరువు ప్రజలు చంద్రబాబు ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న కష్టాలను గడికోటతో పంచుకున్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

రామాపురం మండలం గువ్వలచెరువులో వైఎస్‌ఆర్ సీపీ కార్యకర్త షేక్ మస్తాన్ తండ్రి హనీఫ్ ఇటీవల మృతి చెందారు. 21 రోజులు (లిల్లా) కార్యక్రమం సందర్భంగా శుక్రవారం గువ్వలచెరువులో వారి నివాసానికి శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. హనీఫ్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. మస్తాన్ కుటుంబానికి తోడుగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బయ్య, కోఆప్షన్ సభ్యులు జిలాన్, డాక్టర్ రమణ, ఓబులేసు, ఫయాజ్, రాజు, బలరాం, మల్లయ్య, బాబు, మాబు, జనార్దన్‌రెడ్డి, శ్రీను, బాషు, జాకీర్, ఆసిఫ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి.. అనారోగ్యం


సిద్దవటం ఆరోగ్య ఉప కేంద్రంలో ఊడిపడిన స్లాబ్ పెచ్చులు

సిద్దవటం : ప్రజల ఆరోగ్య కేంద్రానికే జబ్బు చేసింది. రోగులకు ఆరోగ్యం ప్రసాదించాల్సిన భవనం పెచ్చులూడి పడుతూ ప్రమాదకరంగా మారింది. ఇది ఎక్కడో కాదండోయ్ సిద్దవటం మండలం పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యం ఉప కేంద్రంలో.. కూలిపోవడానికి సిద్ధంగా ఉండటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చే రోగులు, గర్భిణులు, వారి సహాయకులు ఎక్కడ తలలు పగులుతాయోనని భయభ్రాంతులకు లోనవుతున్నారు. మండల కేంద్రమైన సిద్దవటం బ్రాహ్మణవీధిలో ఉన్న ఈ ఆరోగ్య ఉప కేంద్రం ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా స్లాబ్ పెచ్చులూడి కింద పడటంతో వైద్య సిబ్బంది, పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారు. పెచ్చులూడిన సమయంలో రోగులు అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పి.కొత్తపల్లె ఆరోగ్య ఉప కేంద్రాన్ని మార్చడమో.. కొత్త భవనం మంజూరు చేయడమో చేపట్టాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు.

మహిళా ఆరోగ్యం దేశానికి సౌభాగ్యం


సుండుపల్లె: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రుబీనా


ఒంటిమిట్ట: గర్భిణికి పోషకాహారం ఇస్తున్న డాక్టర్ అరుణజ్యోతి


నందలూరు: సూచనలు చేస్తున్న వైద్యాధికారి

సుండుపల్లె/నందలూరు/ఒంటిమిట్ట : స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైద్యాధికారులు వైద్య, అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం సుండుపల్లె మండల రాయవరంలో డాక్టర్ రుబీనా, నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె – 3లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటనారాయణ, ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరులో డాక్టర్ అరుణ జ్యోతి ఆధ్వర్యంలో మహిళలను పరీక్షించి మందులను అందజేశారు. అలానే పలు సూచనలు చేశారు. అనంతరం కార్యక్రమ ఉద్దేశాన్ని తెలియజేశారు. కుటుంబ ఆర్థికాభివృద్ధిలో మహిళల స్థానం ప్రత్యేకమన్నారు. వారి ఆరోగ్యంతో కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆయా మండలాల వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవాభావమే లక్ష్యం


ప్రవేశ పరీక్ష రాస్తున్న బాలికలు

చిట్వేలి : స్కౌట్‌తో విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించడమే లక్ష్యమని చిట్వేలి పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం భారత స్కౌట్ అండ్ గైడ్స్ ప్రవేశం పొందిన విద్యార్థులకు మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి ప్రవేశ పరీక్షను నిర్వహించారు. స్కౌట్ మాస్టర్ ఎం.నవీన్ కుమార్, గైడ్ కెప్టెన్ బి.శిల్పకళ మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి ఆదేశాల మేరకు తమ పాఠశాలలో ఇరవై నాలుగు మంది విద్యార్థులు స్కౌట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ నారాయణ గౌడ్, గీతారాణి, సుహాసిని, సునీత, మహమ్మద్ రఫీ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

- వేడుకలకు ముస్తాబైన రాయచోటి అమ్మవారిశాల
- విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా ఆలయం


విద్యుత్ కాంతులీనుతున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి అంతరాలయం

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం గాంధీబజార్‌లో వెలసియున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీల వరకు అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను ఉత్సవ కమిటీ సభ్యులు, శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు అధ్యక్షులు పబ్బిశెట్టి సురేష్‌కుమార్, కార్యదర్శి కేపీఎల్ సత్యనారాయణలు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్రహ్మణ్య శర్మచే ఈ శ్రీ కన్యకా పరమేశ్వరీ పూజా, పురాణాదులు జరుపనున్నట్లు తెలియజేశారు.

దసరా ఉత్సవ వివరాలు

మొదటి రోజైన ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం మహాగణపతిపూజ, స్వస్తివాచనం, పంచగవ్యం, ఋత్విక్‌వరణము, రక్షాబంధనం, శ్రీ చక్రమండపార్చన హిత ప్రధాన కలశస్థాపన, మహా మంగళహారతి, తీర్థప్రసాదం వినియోగ కార్యక్రమాలు నిర్వహించనుండగా అదే రోజు రాత్రి అమ్మవారు శ్రీ వాసవాంబదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ నెల 23వ తేదీ రాత్రి అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో, 24న శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం, 25న శ్రీ పార్వతీదేవి రూపంలో, 26న అమ్మవారు శ్రీ బాలాత్రిపురసుందరీదేవిగా, ఈ నెల 27న శ్రీ భవానిదేవి అలంకారము, 28న అమ్మవారు శ్రీ గజలక్ష్మీదేవిగా కటాక్షించనుండగా, 29న శ్రీ సరస్వతీదేవిగా, 30న కన్యకాపరమేశ్వరి శ్రీ దుర్గాదేవి రూపంలో, అక్టోబర్ 1న ఉదయం చండీ హోమము, మహర్నవమి కార్యక్రమాలు, రాత్రికి అమ్మవారిని శ్రీ విజయలక్ష్మీదేవిగా, 2వ తేదీన ఉదయం శమీ దర్శనము, విజయదశమి, శమీ దర్శనము, రాత్రికి పుష్పపల్లకీదేవి అలంకరణలో పట్టణ మహోత్సవం, 3వ తేదీన ఉదయం తోటోత్సవం, ఉయ్యాల ఉత్సవం, పూలంగిసేవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు కోరారు. ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఆలయంతో పాటు మూలవిరాట్ మూర్తిని విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని నిర్వాహకులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు తెలియజేశారు.

‘పోషణ్’ వంట పోటీలు



చిట్వేలి : పోషణ్ మాసోత్సవాలలో భాగంగా పాత చిట్వేలి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పురుషుల భాగస్వామ్యంతో తల్లిదండ్రుల ఆధ్వర్యంలో వంటల పోటీలు నిర్వహించారు. ఇందులో పురుషులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే పోషకాహారంపై పాల్గొన్న వారితో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు.

తెలుసుకుందాం.. జాగ్రత్తగా ఉందాం


అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రజల్లో ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల చైతన్యం తీసుకురావడానికి ప్రచార రథం ద్వారా చిత్ర ప్రదర్శన చేస్తున్నట్లు ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ గడికోట చెన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లె, కోనంపేట, రాయచోటి పట్టణంలోని మాసాపేట ప్రాంతాలలో ఎయిడ్స్ నివారణ ప్రచార రథం ద్వారా చిత్ర ప్రదర్శన నిర్వహించారు. చిత్ర ప్రదర్శనల ద్వారా ఎయిడ్స్ వ్యాధి, సుఖ వ్యాధులు ఎలా సంభవిస్తాయి.. వ్యాధిగ్రస్తులు ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలి.. వ్యాధి సోకిన వారి ఆరోగ్యం ఎలా ఉంటుంది.. కండోమ్ ఉపయోగాలను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో నరసింహ, పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, సిబ్బంది విజయలక్ష్మి, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు


నందలూరు: వాలీబాల్ మ్యాచ్ ఆడుతున్న బాలుర జట్లు


ఓబులవారిపల్లె: ఆసక్తికరంగా సాగుతున్న ఎస్‌జీఎఫ్ పోటీలు


చిట్వేలి: కబడ్డీ పోటీల్లో తలబడుతున్న బాలికలు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల కో–ఆర్డినేటర్ గౌరీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ పోటీలలో మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి 14, 17 సంవత్సరాలలోపు బాల బాలికలు రెండేసి విభాగాలుగా పలు క్రీడలలో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు త్వరలో డివిజన్ స్థాయిలో జరగబోయే పోటీలలో పాల్గొంటారని కోఆర్డినేటర్ గౌరీ తెలిపారు. ఎంఈఓ అనంతకృష్ణ పోటీలను పర్యవేక్షించగా, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పీటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

చిట్వేలి : ఎస్‌జీఎఫ్ పోటీల్లో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు క్రీడా పోటీలు తహసీల్దార్ స్పందన, ఎంఈఓలు కోదండ నాయుడు, ఈశ్వరయ్యల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అండర్–14, అండర్–17 విభాగాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలలో గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పద్మభూషణ్ రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ శివ శంకర్ రాజు, స్టేట్ బ్యాంక్ మేనేజర్ పుష్పలత, ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, చెన్నయ్య, చిన్నబాబు, సుహాసిని, గీతారాణి, సుభాష్ చంద్రబోస్, హేమలత, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు

ఓబులవారిపల్లె : మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను శుక్రవారం ముక్కావారిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కో–ఆర్డినేటర్, పీఈటీ స్వామి మాట్లాడుతూ క్రీడల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని, విజేతలను పై స్థాయికి వెళ్తారని చెప్పారు. కాగా విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ క్రీడలలో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వాలీబాల్‌లో ఓబులవారిపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.